ఉద్యోగావకాశాలకు పాలిటెక్నిక్

- తక్కువ ఖర్చు, కాల వ్యవధిలో మంచి ఉపాధి అవకాశాలు
- ఈనెల 24 ప్రవేశాల కోసం పాలిసెట్ పరీక్ష



రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్



పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

రామంతాపూర్: పదో తరగతి ఉత్తీర్ణత కాగానే అతి తక్కువ కాలంలోనే ప్రభుత్వ, ప్రైవేట్ బహుళ జాతి సంస్థల్లో అతి తక్కువ ఖర్చుతో ఉద్యోగాలు ఉపాధి పొందాలనుకునే వారికి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు బంగారు బాట వంటివి. ఈనెల నెల 24న ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ డిప్లొమా పోస్టులకు ప్రవేశాలను నిర్వహించే పాలిసెట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించటానికి రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, మేడ్చల్ జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్ వినయ్‌కుమార్‌తో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ.

సాక్షి : పాలిటెక్నిక్ విద్య అంటే?

◆ ప్రిన్సిపాల్ : పాలిటెక్నిక్ విద్యను డిప్లొమా స్థాయి సాంకేతిక విద్య అంటారు. పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు 11, 12 తరగతులకు మరో రెండేళ్ళు గడిపే బదులుగా విద్యార్థులు పరిశ్రమ నిర్దిష్ట నైపుణ్యాలను సంపాదించి త్వరగా ఉద్యోగాలు సంపాదించుకుని కెరీర్ మొదలు పెడతారు.

సాక్షి : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థుల భవిష్యత్తు ఎలా ఉంటుంది?

◆ ప్రిన్సిపాల్: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా ఇస్తున్నాయి. స్వల్ప వ్యవధిలోనే కోర్సులు పూర్తి చేసుకుని ఉద్యోగాలు, ఉపాధి పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. చి న్న వయసులోనే ఉద్యోగం, ఉన్నత విద్యను అ భ్యసించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

సాక్షి : పాలిటెక్నిక్ కోర్సుల్లో టెక్నికల్ కోర్సులే కాకుండా నాన్ టెక్నికల్ కోర్సులు కూడా ఉన్నాయా?

◆ ప్రిన్సిపాల్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించే టెక్నికల్ పోస్టులతో పాటు అగ్రికల్చరల్, హార్టికల్చరల్, వెటర్నరీ వంటి నాన్ టెక్నికల్ కోర్సులు కూడా ఉన్నాయి.

సాక్షి : పాలిటెక్నిక్‌లో నచ్చిన కోర్సును ఏ విధంగా పొందాలి?

◆ ప్రిన్సిపాల్ : పాలిసెట్ ఎంట్రన్స్‌లో వచ్చిన మంచి ర్యాంకు ఆధారంగా మనకు నచ్చిన కోర్సును, నచ్చిన కళాశాలను ఎన్నుకోవచ్చు.

సాక్షి: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించవచ్చా?

◆ ప్రిన్సిపాల్: ఈ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఈసెట్ పరీక్ష రాసి లిటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా బీటెక్, బీఈ కోర్సుల్లో రెండో సంవత్సరంలో చేరవచ్చు. అదే విధంగా ఎంసెట్ ఐఐటీ జేఏఈ తదితర పోటీ పరీక్షలు కూడ రాయవచ్చు.

సాక్షి : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల వ్యవధి ఎంత ఉంటుంది?

◆ ప్రిన్సిపాల్: టెక్నికల్ డిప్లొమా కోర్సుల వ్యవధి మూడు నుంచి మూడున్నర ఏళ్ళు ఉంటుంది. నాన్ టెక్నికల్ కోర్సులైన అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్ సెరికల్చర్ వంటి కోర్సులు రెండు సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాల కాల వ్యవధి ఉంటుంది.

సాక్షి :రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏ డిప్లొమా కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి?

◆ ప్రిన్సిపాల్ : రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జికల్, కెమికల్, ప్యాకేజింగ్, డిప్లొమా కోర్సులు ఉన్నాయి.

మల్కాజిగిరిలో ఈటల గెలుపు తథ్యం



బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు స్వర్ణలత

గౌతంనగర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపు తథ్యమని గౌతంనగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు స్వర్ణలత అన్నారు. గురువారం ఆమె గౌతంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారన్నారు. కేంద్ర ప్రభుత్వ పారదర్శక పాలన బీజేపీకి కలిసి వస్తుందన్నారు. కేంద్రం ప్రభుత్వం నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమమే బీజేపీ ప్రభుత్వం మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడ్డ కార్యకర్తలకు, ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రాగిడి గెలుపు ఖాయం : మర్రి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం తన కార్యాలయంలో మల్కాజిగిరి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సరళిని పరిశీలించామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏ విధంగా ఉందో అదే విధంగా ఉందన్నారు. ప్రజలు గత ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించారని, ఈసారి కూడా పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపిస్తారన్న నమ్మకం ఉందన్నారు. లక్ష్మారెడ్డి గెలిస్తే ప్రజా సమస్యలపై ప్రభుత్వంతో పాటు కేంద్రంలో పోరాడటానికి అవకాశం కలుగుతుందన్నారు. రాగిడి లక్ష్మారెడ్డికి ప్రచారంతో పాటు ప్రశాంత ఓటింగ్‌కు సహకరించిన కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు మీనారెడ్డి, సునీతాయాదవ్, నాయకులు జగదీష్‌గౌడ్, వెంకన్న, అనిల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు



నివాళులు అర్పిస్తున్న బీసీ ఐక్యవేదిక నాయకులు

మారోజు వీరన్నకు నివాళి

మల్కాజిగిరి: బీసీ కులాలను చైతన్య పరిచి వర్గకుల నిర్మూలన లక్ష్యంగా పనిచేసిన ఘనత మారోజు వీరన్నకు దక్కుతుందని బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు కామల్ల ఐలన్న అన్నారు. వర్గకుల పోరాట నాయకుడు మారోజు వీరన్న 25వ వర్ధంతిని ఓల్డ్ సఫిల్‌గూడలోని బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలన్న మాట్లాడుతూ నేటి యువత మారోజు వీరన్నను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం వీరన్నకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, శ్రీనివాస్, చంద్రశేఖర్, గోపి తదితరులు పాల్గొన్నారు.



హబ్సిగూడ డివిజన్ వీధి నెంబర్–8లో గురువారం కురిసిన వర్షానికి చెట్లు విరగగా, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో అటుగా వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వెంటనే రంగంలోని దిగిన అధికారులు చెట్ల తొలగింపుతోపాటు, మరమ్మతు చర్యలు చేపట్టారు. – హబ్సిగూడ

డెంగీని తేలిగ్గా తీసుకోవద్దు

అవగాహన ర్యాలీని ప్రారంభించిన జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి రఘునాథ్‌స్వామి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రఘునాథ్‌స్వామి

అల్వాల్: డెంగీని తెలిగ్గా తీసుకోవద్దని వ్యాధిని గుర్తించపోతే ప్రాణాలు పోయే అవకాశం ఉందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడెస్ దోమల ద్వారా డెంగీ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయకపోతే ప్రాణాంతకమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకోవటంతోపాటు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఫ్రైడేను డ్రై డేగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ నారాయణరావు, డాక్టర్ గీతా ప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ పద్మావతి, ఆరోగ్య కేంద్రం వైద్యులు కపూర్, డాక్టర్ రాజమల్లు, లింగాల అక్షయ్‌కుమార్, సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ నివారణ కోసం అవగాహన ర్యాలీ

అల్వాల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ సర్కిల్ డీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంటమాలజిస్ట్ ఏఈ అనిల్‌కుమార్ ఆదేశానుసారం గురువారం అల్వాల్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను నీరు నిలవకుండా చూసుకోవాలని, శుభ్రత పాటించాలని, వారానికి తప్పనిసరిగా డెంగీ నివారణ కోసం సిబ్బందితో దోమల మందు పిచికారి చేయించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజిస్ట్ సిబ్బంది రాజు, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో జాతీయ డెంగీ దినోత్సవం అవగాహన ర్యాలీ దృశ్యం

వేర్వేరు సంఘటనల్లో ముగ్గురి ఆత్మహత్య

ఉప్పల్: వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా, మిర్యాలగూడకు చెందిన సీకకోలా రమేష్, కవిత దంపతులు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఉప్పల్, రాజ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. కిరాణ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గురువారం అతడి భార్య కవిత పిల్లలను తీసుకొని ఆమె సోదరుడి కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరిలోని స్వర్ణగిరి ఆలయానికి వెళ్లి సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటికి చేరుకుంది. ఇంటి తలుపులు తెరవక పోవడంతో కిచెన్‌లోంచి చూడగా రమేష్ సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో 108కు ఫోన్ చేయగా వచ్చిన సిబ్బంది అతడిని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేక..



అనురాధ(ఫైల్)

ఉప్పల్: అత్తింటి వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడి మృతిచెందిన సంఘటన గురువారం ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్, నంద్యాల, నందికొట్కూరుకు చెందిన తెలారి బాల హనుమంతుకు ఐదుగురు సంతానం. రెండో కూతురు అనురాధకు 16 సంవత్సరాల క్రితం నంద్యాలకు చెందిన సుబ్బన్నతో వివాహం చేశాడు. కొంత కాలం క్రితం వారు బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఉప్పల్, హిల్స్‌కాలనీ, కుర్మనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో భర్త సుబ్బన్న తల్లి నాగేశ్వరమ్మ, సోదరుడు శ్రీనివాస్‌తో కలిసి భార్య అనురాధను మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో వేధింపులు తాళలేక అనురాధ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఇరుగుపొరుగు వారు మృతురాలి సోదరి ఆదిలక్ష్మికి సమాచారం ఇవ్వడంతో విషయం తెలిసిన అనురాధ తల్లిదండ్రులు ఉప్పల్ చేరుకొని వారిని నిలదీశారు. అనురాధ ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేశారు. భర్త సుబ్బన్న, అతడి సోదరుడు శ్రీనివాస్, తల్లి నాగేశ్వరమ్మ వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

మనస్తాపంతో విద్యార్థి...



వెంకటరమణ(ఫైల్)

కుషాయిగూడ: మనస్తాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పెద్ద చర్లపల్లికి చెందిన జి. వెంకటరమణ (20) గత ఏడాది ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో మనోవేదనకు గురైన వెంకటరమణ గురువారం తన బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అల్వాల్: మద్యం కోసం గొడవపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం పోచమ్మ గుడి ప్రాంతంలో నివాసముండే సురేష్ (45) భార్య ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నాడు. పెయింట్ పని చేస్తున్న సురేష్ మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలోనే అల్వాల్ సూర్యనగర్‌లో నివాసముండే భరత్‌ను ఈ నెల 13న సురేష్ మద్యానికి తన డబ్బులు లేవని రూ.50 ఇవ్వాలని అడిగాడు. దీంతో తనకు తరుచు డబ్బులు ఎందుకు అడుగుతున్నావని భరత్ సురేష్‌తో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో మాటమాట పెరగడంతో ఆవేశానికి లోనైన భరత్ సురేష్ మొఖం, తల, మెడ, చెవులపై పిడిగుద్దులు గుద్దాడు. దీంతో తీవ్రగాయాలపాలైన సురేష్ చికిత్స పొందుతు గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్షానికి రోడ్లన్నీ జలమయం

రామంతాపూర్ : రామంతాపూర్ పరిధిలో గురువారం ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 45 నిమిషాలపాటు కురిసిన వర్షానికి రోడ్లు వర్షపు నీటితో నిండిపోయి కుంటలను తలపించాయి. వర్షానికి రామంతాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు బస్తీలో, కాలనీలో దాదాపు మూడు గంటల సేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



నీట మునిగిన రామంతాపూర్ బైపాస్ రోడ్డు



రామంతాపూర్‌లో వర్షానికి జలమయమైన రోడ్డు



ఆనంద్‌బాగ్‌లో...

నీటమునిగిన కాలనీలు

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో గురువారం కురిసిన ఆకస్మిక వర్షానికి కాలనీలతో పాటు రహదారులు నీటమునిగాయి. మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఆర్‌కెనగర్, ఆనంద్‌బాగ్ ప్రాంతంలో ప్ర దాన రహదారులపై వర్షంనీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. సర్దార్‌పటేల్‌నగర్, అనంతసరస్వతీనగర్, షిర్డీనగర్ తదితర కాలనీల్లోని వర్షపు నీటితో నాలాలు పూర్తిగా నిండి రోడ్లపై ప్రవహించింది. అయితే ఎప్పటి నుంచో నాలాల్లో పూడిక తీయకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఆర్‌కెనగర్ బ్రిడ్జి సమీపంలో..

విహార యాత్రలతో విజ్ఞానం పెంపుదల



విహార యాత్రలో వికాస్ లెర్నింగ్ సెంటర్ విద్యార్థులు

మల్లాపూర్: విద్యార్థులను విహారయాత్రలకు తీసుకెళ్లడం ద్వారా వారిలో విజ్ఞాన పెంపుదలకు దోహదపడతాయని ఎక్స్‌ట్రా మైల్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు నాగమోహన్ అన్నారు. విద్యా వికాస్ లెర్నింగ్ సెంటర్ చెందిన 20 మంది విద్యార్థులు నగరంలోని పలు విహార కేంద్రాలను సందర్శించి సరదగా గడిపారు. ఈ సందర్భంగా నాగమోహన్ మాట్లాడుతూ విద్యార్థులను పలు ప్రదేశాలకు తీసుకెళ్తూ అక్కడ విశిష్టతల గురించి తెలియజేస్తే వారికి మంచి అవగాహన కలుగుతుందన్నారు. విజ్ఞాన యాత్రకు తీసుకువెళ్లాడానికి సహకరించిన దాతలు సందీప్, వాణి, రాకేష్, కృతజ్ఞతలు తెలిపారు. ఈ విహార యాత్రలో సెంటర్ కోఆర్డినేటర్ నరేందర్, టీచర్ సరిత తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో మంచి ఆరోగ్యం



పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంటమాలజిస్ట్ అధికారి

మల్లాపూర్: పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ వంటి ప్రమాదకర వ్యాధుల బారి నుంచి తప్పించుకుంటామని తద్వారా మంచి ఆరోగ్య జీవనం గడుపుతామని కాప్రా సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డి.రమేష్ అన్నారు. ప్రపంచ డెంగీ నివారణ రోజును పురస్కరించుకొని మల్లాపూర్ సూర్యనగర్ కాలనీలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ రమేష్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల పరిశుభ్రతతోపాటు, నీరు నిల్వడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్య క్రమంలో డాక్టర్ మాధవి, జిఎస్ఎంఎస్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, మల్లాపూర్ డివిజన్ ఎంట మాలజీ సూపర్‌వైజర్ కనకరాజు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలి



అక్రమంగా షెడ్ నిర్మిస్తున్న దృశ్యం

రామంతాపూర్: బైపాస్ రోడ్డులోని శ్రీనగర్ కాలనీ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్న షెడ్డును తొలగించాలని స్థానికులు గురువారం డిమాండ్ చేశారు. విషయాన్ని సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు చొరవ చూపి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని లేదంటే సర్కిల్ కార్యాలయం ఎదుట ఆందోళనలకు దిగుతామని వారు హెచ్చరించారు.

ఆర్థికసాయం అందజేత



తేజావత్ భంగ్య కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సింగం చెరువుతండాకు చెందిన తేజావత్ భంగ్య (45) గురువారం మృతి చెందాడు. బీఎల్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు రూ.5 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగ చెరువు తండా అధ్యక్షులు పీరునాయక్ తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: సీఎం రిలీఫ్‌ఫండ్ నిరుపేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం వినాయక్‌నగర్ డివిజన్ కాకతీయనగర్‌కు చెందిన సంజయ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.1,50,000 ఎల్‌వోసీ పత్రాన్ని మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యాలబారిన పడినప్పుడు సీఎం రిలీఫ్‌ఫండ్‌తో ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాంరెడ్డి, చంద్రమౌళి, శేఖర్‌గౌడ్, అరుణ్, ఉమేష్, తదితరులు పాల్గొన్నారు.